# ప్రతిపక్షాలకు దిమ్మతిరిగేలా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో



సంబురాలు చేసుకుంటున్న నాయకులు

ఉట్నూర్, అక్టోబర్ 16 : సీఎం కేసీఆర్ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టో ప్రతిపక్షాలకు దిమ్మతిరిగే విధంగా ఉందని ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో విడుదల చేసిన సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో బీఆర్ఎస్ నాయకులు పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పేదలకు ఎంతో లబ్ధి చేకూరేలా ఉన్నదన్నారు. మ్యానిఫెస్టోలో సంక్షేమం, అభివృద్ధి ఓ వైపు, మహిళలు, వృద్ధులకు భరోసా ఇచ్చేలా ఉన్నదని చెప్పారు. మ్యానిఫెస్టో రూపకల్పన చేసిన సీఎం కేసీఆర్‌కు ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సామ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కందుకూరి రమేశ్, నాయకులు జగ్జీవన్‌రావ్, దాసండ్ల ప్రభాకర్, సలీం, ముజీబ్, భీంరావ్, ఆశన్న, రాజ్‌కుమార్, వెంకటేశ్, లక్ష్మీపతి, సోనేరావ్, చౌకత్, రాంబాయి, వాసు, రాజ్‌కుమార్, గంగాధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అటవీ హక్కు చట్టంపై అవగాహన కల్పించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్, అక్టోబర్ 16 : గిరిజనులకు అటవీ హక్కు చట్టంపై అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మండల కేంద్రంలోని కుమ్రంభీం ప్రాంగణంలో ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, సెంటర్ ఫర్ కలెక్టివ్ ఫారెస్ట్ ప్రాజెక్ట్ మేనేజర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ హక్కు చట్టం, దాని ఉద్దేశం గ్రామ స్థాయిలో గిరిజనులకు తెలుపాలన్నారు. ఏజెన్సీలో గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులు, వాటి ప్రాధాన్యత, ధరలు వాటిపై అవగాహన కల్పించాలన్నారు. వాటి ద్వారా వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడేటట్లు సహకరించాలన్నారు. అందులో భాగంగా ఈ కార్యక్రమంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా మొదటగా ఆదిలాబాద్ జిల్లాలోని సిరికొండ మండలం, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు సమన్వయంతో ముందుకు సాగి గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ ప్రాజెక్ట్‌ను గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని పీవీటీజీ గ్రామాల్లో మొదటి దశలో విస్తరించడానికి ఈ అవగాహన కార్యక్రమం దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో డీడీ దిలీప్, బీఆర్ఎల్ఎఫ్ శ్రీనివాస్, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పెసా కోఆర్డినేటర్ వసంత్‌రావ్, సీసీడీ కుమ్రం విఠల్ రావ్, ఏపీడీ, డీఆర్డీవోలు చందన్‌దాస్, శ్రీనివాస్, సీపీఎఫ్ డైరెక్టర్ గిరిజ, ఏపీఎంలు, డీపీఎంలు పాల్గొన్నారు.

# వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

నార్నూర్, అక్టోబర్ 16 : వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాథోడ్ సావీందర్ అన్నారు. సోమవారం మాన్కాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నార్నూర్ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నపాటి జ్వరం, దగ్గు, జలుబు వచ్చిన ప్రభుత్వ దవాఖానలో వైద్యం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్, ఆశ కార్యకర్త గుంపాబాయి, సిబ్బంది పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాల నిర్వహణకు భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న మఠాధిపతి యోగానంద సరస్వతి

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 16 : జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి తెలిపారు. విజయ దశమి ఉత్సవాల నిర్వహణ కోసం సోమవారం రాంలీలా మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్, సభ్యులతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. దసరా ఉత్సవాలకు పట్టణ ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ప్రఫుల్‌వాఝే, కార్యదర్శి మాధవ్, సభ్యులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ

తలమడుగు, అక్టోబర్ 16 : మండలంలోని కోసాయి గ్రామానికి టేకం లక్ష్మీబాయి ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సోమవారం టేకం లక్ష్మీబాయిని జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి పరామర్శించి నిత్యావసర సరుకులు, సహాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుభాష్, ఎంపీటీసీ వెంకన్న, మాజీ ఎంపీటీసీ దాదారావ్, దత్తు, ప్రకాశ్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

జైనథ్, అక్టోబర్ 16 : మాకోడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నీపుంగె జ్ఞానేశ్వర్ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్యే జోగు రామన్న పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

## క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

- డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్
- వైద్యాధికారులు, ఏఎన్ఎంలతో సమావేశం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్

ఎదులాపురం, అక్టోబర్ 16 : క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి త్వరగా వైద్య చికిత్స అందించడం ద్వారా బాధితులు కోలుకోవచ్చని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో డీఎంవో మెట్‌పెల్లివార్ శ్రీధర్‌తో కలిసి వైద్యాధికారులు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో 3,55,440 మంది 30 సంవత్సరాల పైబడి ఉన్నారని తెలిపారు. పీహెచ్‌సీ నుంచి ముగ్గురి చొప్పున శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఏఎన్ఎంలు ఈ నెల 26 నుంచి ఇంటింటికీ తిరుగుతు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసి అనుమానితుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. బాధితులను రిమ్స్, హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తామన్నారు. సమావేశంలో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 16 : ఆదిలాబాద్‌లోని నలంద కళాశాల ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ బతుకమ్మను మధ్యలో ఉంచి పాటలకు అనుగుణంగా విద్యార్థినులు, అధ్యాపకులు కోలాటాలు, నృత్యాలు చేసి సంబురంగా ఆడిపాడారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన

ఇచ్చోడ, అక్టోబర్ 16 : మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులకు రోడ్డు భద్రత గురించి సోమవారం ఆర్టీసీ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నడిపే విధానం, పాటించాల్సిన సూచనల గురించి వివరించారు. టీఎస్ ఆర్టీసీ ద్వారా అందిస్తున్న వివిధ రకాల పాసుల గురించి, టీ 9–60, టీ 30, టికెట్ల వలన కలిగే లాభాల గురించి, దివ్యాంగుల బస్‌పాసుల గురించి వివరించారు. దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ లక్కీ డ్రా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో సేఫ్టీ వార్డన్ జీ విష్ణు, ఏడీసీ ఎస్ హీరలాల్, విలేజ్ ఆఫీసర్ సతీశ్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

## ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 16 : హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధించినట్లు కోర్టుల సమన్వయ అధికారి సక్రియా నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన కుంటాల సుందర్ తన సొంత పని కోసం 2022 జూలై 21న నిర్మల్‌కు వచ్చాడు. అక్కడ సోన్ మండలం గంజాల్‌కు చెందిన జోజేకర్ గజేందర్ అలియాస్ రామ్ (35), జోజేకర్ రాణి అలియాస్ నర్రా వనిత (28) మేము భార్యభర్తలు వారం రోజులుగా మాకు పనిలేదు.. దిలావర్‌పూర్‌లో పని ఇప్పించాలని సుందర్‌ను కోరారు. వారి మాటలు నమ్మి ఇంటికి తీసుకెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత తన భార్యతో చనువుగా మాట్లాడుతున్నావని అనుమానంతో అక్కడ ఉన్న ఖాళీ విస్కీ బాటిల్ తీసుకొని సుందర్ తలపై రామ్ కొట్టాడు. రాణి సుందర్ చేతులు పట్టుకొని చంపేయమని అంటూ ఇద్దరు కలిసి చంపేందుకు యత్నించారు. కత్తితో పలు చోట్ల పొడిచారు. బాధితుడు అరుపులు వేయడంతో చుట్టు పక్కల వారు రాగా వారు పారిపోయారు. బాధితుడి మిత్రుడు చిన్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ గంగాధర్ కేసు నమోదు చేశారు. అదనపు ప్రాసిక్యూటర్ వై రమణారావు 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి కే అజేశ్‌కుమార్ నిందితులైన జోజేకర్ గజేందర్, జోజేకర్ రాణికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.